శ్రీరస్తు శుభమస్తు

శ్రీ శంకరాచార్య విరచిత

శ్రీ త్రిపుర సుందర్యష్టకమ్

- భావార్థముతో -



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



శ్రీ త్రిపుర సుందర్యష్టకమ్ - భావార్థముతో -

01. కదంబవనచారిణీం మునికదంబకాదంబినీ
నితంబజితభూధరాం సురనితంబినీ సేవితామ్।
నవాంబురుహ లోచనాం అభినవాంబుద శ్యామలాం
త్రిలోచన కుటుంబినీం త్రిపురసుందరీమాశ్రయే॥

కదంబ వృక్షముల (కమిడి చెట్లు) వనమందు నివసించునది, ముని సముదాయమను కదంబవృక్షములను వికసింపజేయు (ఆనందింప చేయు) మేఘమాలయైనదీ, పర్వతములకంటే ఎత్తైన నితంబము కలదీ, తొలకరి మబ్బులవలే నల్లనైనదీ, మూడు కన్నులు కల పరమేశ్వరుని ఇల్లాలు అగు త్రిపురసుందరిని ఆశ్రయించుచున్నాను.

02. కదంబ వనవాసినీం కనకవల్లకీ ధారిణీం
మహార్హ మణిహారిణీం ముఖసముల్లస ద్వారుణీమ్।
దయావిభవ కారిణీం విశదరోచనా చారిణీం
త్రిలోచన కుటుంబినీం త్రిపురసుందరీమాశ్రయే॥

కదంబ వనమందు నివసించునది, బంగారు వీణను ధరించినదీ, అమూల్యమైనర మణిహారముల నలంకరించుకున్నదీ, ముఖము నందు వారుణీ (ఉత్తమమైన మద్యము) పరిమళము కలదీ, అత్యధికమైన దయను కురుపించునదీ, గోరోచనము పూసుకున్నదీ, మూడు కన్నులు కల పరమేశ్వరుని ఇల్లాలు అగు త్రిపురసుందరిని ఆశ్రయించుచున్నాను.

03. కదంబవనశాలయా కుచభరోల్లసన్మాలయా
కుచోపమితశైలయా గురుకృపాలసద్వేలయా।
మదారుణకపోలయా మధురగీతవాచాలయా
కయాపి ఘనలీలయా కవచితా వయం లీలయా॥

కదంబ వనములోనున్న ఇంటిలో నివసించునదీ, వక్షోజములపై పుష్పమాల నలంకరించుకున్నదీ, పర్వతములవలే ఎత్తైన స్తనములు కలదీ, అధికమైన కృపా సముద్రమునకు తీరము వంటిదీ, మధ్యముచే ఎఱ్ఱనైన చెంపలు కలదీ, మధుర సంగీతమును గానముచేయుచున్నదీ, వర్ణించనలవి కానిదీ, మేఘము వలే నల్లనిదీ అగు ఒక లీలచే మనము రక్షింపబడుచున్నాము.

04. కదంబవన మధ్యగా కనకమండలోపస్థితాం
షడంబురుహ వాసినీం సతతసిద్ధ సౌదామినీమ్।
విడంబిత జపారుచిం వికచచంద్ర చూడామణిం
త్రిలోచన కుటుంబినీం త్రిపురసుందరీమాశ్రయే॥

కదంబ వన మధ్యమునందున్నదీ, బంగారు మండపము నందు కొలువు తీర్చునదీ, మూలాధారము – స్వాధిష్టానము – మణిపూరము – అనాహతము – విశుద్ధము – ఆజ్ఞ లనే ఆరు చక్రములందు నివసించునదీ, ఎల్లప్పుడు యొగసిద్ధులకు మెరుపు తీగవలే దర్శన మిచ్చునదీ, మంకెనపువ్వు వంటి శరీర కాంతి కలదీ, శిరస్సుపై చంద్రుని ఆభరణముగా ధరించినదీ, మూడు కన్నులు కల పరమేశ్వరుని ఇల్లాలు అగు త్రిపురసుందరిని ఆశ్రయించుచున్నాను.

05. కుచాంచిత విపంచికాం కుటిలకుంతలాలంకృతాం
కుశేశయ నివాసినీం కుటిలచిత్త విద్వేషిణీమ్।
మదారుణ విలోచనాం మనసిజారి సమ్మోహినీం
మతంగముని కన్యకాం మధురభాషిణీమాశ్రయే॥

వక్షస్థలము నందు వీణ కలదీ, వంకరయైన కేశములతో అలంకరింపబడినదీ, సహస్రార పద్మమునందు నివసించునదీ, దుష్టులను ద్వేషించునదీ, మద్యపానముచే ఎర్రనైన కన్నులు కలదీ, మన్మథుని జయించిన శివుని కూడ మోహింప చేయునదీ, మతంగమహర్షికి కుమార్తెగా అవతరించినదీ, మధురముగా మాట్లాడునదీ అగు త్రిపురసుందరిని ఆశ్రయించు చున్నాను.

06. స్మరేత్ ప్రథమ పుష్పిణీం రుధిరబిందు నీలాంబరాం
గృహీత మధుపాత్రికాం మదవిఘూర్ణ నేత్రాంచలామ్।
ఘనస్తన భరోన్నతాం గలితచూలికాం శ్యామలాం
త్రిలోచన కుటుంబినీం త్రిపురసుందరీమాశ్రయే॥

ప్రథమరజస్వలయై ఆ రక్త బిందువులంటియున్న నల్లని వస్త్రమును ధరించినదీ, మద్యపాత్రను పట్టుకున్నదీ, మద్యపానముచే ఎర్రనై కదలుచున్న కన్నులు కలదీ, ఉన్నతమైన స్తనములు కలదీ, జారుచున్న జడముడి కలదీ, శ్యామల (నల్లనిది) యైనదీ, మూడు కన్నులు కల పరమేశ్వరుని ఇల్లాలు అగు త్రిపురసుందరిని ఆశ్రయించు చున్నాను.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

07. సకుంకుమ విలేపనాం మళికచుంబి కస్తూరికాం
సమంద హసితేక్షణాం సశరచాప పాశాంకుశామ్।
అశేషజన మోహినీం అరుణమాల్య భూషాంబరాం
జపాకుసుమ భాసురాం జపవిధౌ స్మరేత్ అంబికామ్॥

కుంకుమతో కలిసిన విలేపమును పూసుకున్నదీ, ముంగురులను తాకుచున్న కస్తూరి తిలమును ధరించినదీ, చిరునవ్వులతో కలసిన కన్నులు కలదీ, పుష్పబాణమును – చెరకు వింటినీ – పాశాంకుశములను ధరించినదీ, అశేష జనులను మోహింపచేయునదీ, ఎర్రని పూలదండలను – ఆభరణములను – వస్త్రములను ధరించినదీ, జపాపుష్పము వలే ప్రకాశించు చున్నదీ అగు జగదంబను జపము చేయునపుడు స్మరించెదను.

08. పురందర పురంధ్రికా చికురబంధ సైరంధ్రికాం
పితామహి పతింవ్రతా పటుపటీర చర్చారతామ్।
ముకుంద రమణీమణీ లసదలం క్రియాకారిణీం
భజామి భువనాంభికాం సురవధూటి కాచేటికామ్॥

ఇంద్రుని భార్యయగు శచీ దేవిచే కేశాలంకరణ చేయబడినదీ, బ్రహ్మదేవుని భార్యయగు సరస్వతిచే మంచి గంధము పూయబడినదీ, విష్ణుపత్నియగు లక్ష్మీదేవిచే అలంకరింపబడినదీ, దేవతాస్త్రీలు చెలికత్తెలుగా కలదీ యగు జగన్మాతను సేవించు చున్నాను.

॥ ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

– – ఇతి శ్రీ త్రిపురసుందరీ అష్టకమ్ సంపూర్ణమ్ – –

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

Kiron Type Institute




(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి. –944 044 9650, 994 994 1430)